## 1.46 లక్షలు రావాలి



నేను 13 ఎకరాల్లో వరి సాగు చేశాను. సొసైటీకి రెండు నెలల కిందట 292 క్వింటాళ్ల ధాన్యం విక్రయించా. సుమారు రూ.1.46 లక్షల వరకు బోనస్ రావాల్సి ఉంది. ప్రభుత్వ ప్రకటనలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. రైతులకు బోనస్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బోనస్ నగదు కోసం ప్రతిరోజూ ఎదురుచూస్తూనే ఉన్నా. బోనస్‌తో ఆర్థిక భరోసా పెరుగుతుందని అనుకున్నా. కానీ ప్రభుత్వం చేస్తున్న ఆలస్యంతో వరి రైతులం మోసపోతున్నాం. బోనస్ అందని రైతులు ఇంకా చాలామంది ఉన్నారు.

**- ఆకుల రామకృష్ణ, అశ్వారావుపేట, ఖమ్మం జిల్లా**

## బోనస్ నగదు జమ కాలేదు



మూడు ఎకరాల్లో 60 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. సన్నాలకు బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో కొనుగోలు కేంద్రంలో విక్రయించా. కానీ, ఇప్పటి వరకూ బోనస్ రాలేదు. ఎప్పుడు అడిగినా రేపు, మాపు అంటున్నారు. 45 రోజులుగా ఎదురుచూస్తున్నా. రోజూ బ్యాంకుకు వెళ్లి బ్యాలెన్స్ చూసుకుంటున్నా. బోనస్ నగదు మాత్రం జమకావడం లేదు. అసలు ఇస్తారో.. ఇవ్వరో కూడా తెలియడం లేదు. సార్లను అడిగితే 'పడతాయి ఆగండి' అంటున్నారు.

**- ముదిగొండ కృష్ణ, వడ్డిగూడెం, అన్నపురెడ్డిపల్లి , ఖమ్మం జిల్లా**

## మాట నిలబెట్టుకోవడమంటే ఇదేనా?



నాది భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామం. 80 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. ఇంత వరకు బోనస్ నగదు రాలేదు. 45 రోజులు గడిచిపోయాయి. రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్‌ను నమ్మి ప్రభుత్వానికే ధాన్యం విక్రయించా. కానీ, ఇంకా బోనస్ జమ చేయలేదు. మాట నిలబెట్టుకోవడం అంటే ఇదేనా? బోనస్ ఇవ్వలేమని ముందుగా చెబితే మేం బయటే విక్రయించుకునేవాళ్లం కదా? ఇంత మోసమా? రైతుభరోసా విషయంలోనూ ఇలాగే చేస్తున్నారు. ఇంకా చాలామందికి రాలేదు.

**- మానికల విజయలక్ష్మి, రావికంపాడు, చంద్రుగొండ, ఖమ్మం జిల్లా**

## అధికారులు పట్టించుకోవడం లేదు



రెండు ఎకరాల్లో వరి పండించా. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 వందల బోనస్ ఇస్తామని చెప్పడంతో పెట్టుబడి కోసం అప్పు చేశా.. వడ్లు అమ్మినప్పుడు కూడా వారం రోజుల్లో డబ్బులు పడతాయని చెప్పారు. కానీ, జమకాలేదు. అధికారుల చుట్టూ చాలాసార్లు తిరిగాక 20 రోజులకు డబ్బులు పడ్డాయి. బోనస్ ఏమైందని అడిగితే నీకు రాలేదని చెబుతున్నారు. ఎంత మంది రైతులను ప్రభుత్వం ఇలా మోసం చేస్తుంది. అందరికి వేస్తామని చెప్పి వేయకపోవడం దారుణం.

**- రవికుమార్, కోడూరు, మహబూబ్‌నగర్ మండలం**

## ఇంకా బోనస్ డబ్బులు రాలే



రెండెకరాల్లో జై శ్రీరాం వడ్లు వేసిన. రెండు నెలల కిందట 40 క్వింటాళ్ల వడ్లు సహకార సంఘపోళ్లకు అమ్మిన. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తమంటే ఆశపడిన. కాంట పెట్టేటప్పుడు వారంలోనే బోనస్ డబ్బులు పడతయన్నరు. ఇంతవరకు పడలే. సంఘపోళ్లను అడిగితే రేపు.. మాపు అంటున్నరు. నాతో పాటు చాలామంది రైతులకు బోనస్ రావాలి. ప్రైవేట్ వాళ్లకి అమ్మితే క్వింటాలుకు 2,800 చొప్పున కొన్నరు.

**- కుడె పోషన్న, గిరివెల్లి, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా**

# సన్నవడ్ల బోనస్‌కు ఎగనామం

### 48 రోజులైనా రైతుల ఖాతాల్లో జమ చేయలేదు • పెండింగ్‌లో ఉన్న 432 కోట్లు విడుదలచేయాలి

### మంత్రి ఉత్తమ్‌కుమార్ మాటలు ఉత్తర ప్రగల్భాలు • రైతులను దగా చేసిన కాంగ్రెస్ సర్కార్: హరీశ్

- వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైంది?
- షరతులు లేకుండా కందులు కొనుగోలు చేయాలి
- పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ
- సిద్దిపేటలో మీడియాకు విడుదల చేసిన హరీశ్‌రావు



సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సన్నవడ్లకు బోనస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్న వడ్లు 8.64 లక్షల టన్నులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.432 కోట్ల బోనస్ పెండింగ్‌లో ఉన్నదని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటలు గొప్పగా, చేతలు చేదుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. 48 గంటలు కాదు 48 రోజులైనా రైతుల ఖాతాలో బోనస్ డబ్బులు జమ కాలేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖను సిద్దిపేటలో మీడియా సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఉత్తమ్.. మీరు మాటల మనిషా? మోసం మనిషా? అని ప్రశ్నించారు. సన్న వడ్లు రైతులు అమ్ముకొని రెండు నెలలు దాటుతున్నా, బోనస్ డబ్బులు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు నిలిపివేసి 50 రోజులు గడిచిపోతున్నాయని గుర్తుచేశారు. రెండో పంటకు సిద్ధం కావాల్సిన రైతులు బోనస్ కోసం అధికారుల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. సన్నవడ్లకు ఇస్తామన్న బోనస్‌ను కూడా ఎగవేస్తున్నారని మండిపడ్డారు. అన్ని పంటలకు క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తామని ప్రకటించి ఇవ్వాళ యూటర్న్ తీసుకున్నారని విమర్శించారు. 2 లక్షల రుణమాఫీ అంతంత మాత్రమే పూర్తి చేశారని, రైతుభరోసాకు కోతలు విధించారని ధ్వజమెత్తారు.

### రైతు డిక్లరేషన్‌ను తుంగలో తొక్కారు

కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ రైతు డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు రైతుభరోసా, సన్న వడ్లకు బోనస్ పైసలు కూడా ఇవ్వలేదని, ఇలాంటి పరిస్థితుల్లో రెండో పంట ఎలా వేస్తారని ప్రశ్నించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ అబద్ధమా? మీరిచ్చిన బాండ్ పేపర్ బూటకమా? సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో రైతులంతా వ్యవసాయాన్ని పండగలా చేశారని, రేవంత్‌రెడ్డి పాలనలో దండగలా మారి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. రైతు డిక్లరేషన్‌లో ప్రకటించినట్టుగా రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి 15 వేల రైతుభరోసా, అన్ని పంటలకు బోనస్, కౌలురైతులకు రైతు భరోసాను 100 రోజుల్లో అమలుచేస్తానంటూ దేవుళ్ల సాక్షిగా ప్రమాణంచేసి, 420 రోజులైనా అమలు చేయలేదని విమర్శించారు.

> కాంగ్రెస్ పార్టీకి ఎందుకు క్షీరాభిషేకం చేయాలి? రుణమాఫీ చేయనందుకా? రైతుబంధు ఇయ్యనందుకా? సన్నవడ్లకు బోనస్ ఇయ్యనందుకా? రండి.. గ్రామాలకు వస్తే ఏ అభిషేకాలు చేయాలో ప్రజలు చేసి చూపిస్తారు.
>
> **- హరీశ్‌రావు**

### ఉత్తమ్ మాటలు ఉత్తర ప్రగల్భాలు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటలు ఉత్తర కుమార ప్రగల్భాలాలు అయ్యాయని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా రైతులను ఇబ్బందులు పెట్టామా? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా ముచ్చింతల రైతులు వడ్లు అమ్మి రెండు నెలలైనా ప్రభుత్వం బోనస్ చెల్లించడం లేదంటూ కలెక్టర్‌ను కలిస్తే.. ప్రభుత్వం విడుదల చేయడంలో ఆలస్యం అవుతున్నదంటూ సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. నంగునూరు మండలం గట్లమల్యాల రైతులు తనను కలిసి, సన్నవడ్ల డబ్బులు రాలేదని చెప్పారని, రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నదన్నారు.

### కందులు కొనుగోలు చేయాలి

షరతులు, కోతలు లేకుండా కందులను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కందులు ఎకరానికి మూడు క్వింటాల్లే కొంటున్నరు. ఇదేం పాలన? ఇది సగం పాలనా? ఎకరానికి మూడు క్వింటాళ్ల కందులు కొనుడు ఏంది? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులు ఎన్ని కందులు పండిస్తే అన్ని కొనుగోలు చేశామని గుర్తుచేశారు. ఎకరానికి ఆరు నుంచి పది క్వింటాళ్ల వరకు పండుతాయని, మిగితా కందులు ఎక్కడ అమ్ముకోవాలని నిలదీశారు. రైతు పండించిన మొత్తం కందులను కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంది రైతుల మీద ఎందుకు పగ? అని మండిపడ్డారు. క్రాప్ బుకింగ్‌లో మిస్సింగ్ అయిన రైతులకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మూడు క్వింటాళ్ల కందులను కొనుగోలు చేయడాన్ని వ్యవసాయ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు సమర్థిస్తున్నారా? అని సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల ముందు కందులకు రూ.400 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఎగ్గొడుతున్నారని విమర్శించారు. కందుల మద్దతు ధర రూ.7,500కు బోనస్ రూ.400 కలిపితే రూ.7,900కు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎకరాల్లో కంది సాగు అయితే, క్రాప్‌బుకింగ్ ఆరు లక్షల ఎకరాల వరకు అయిందని చెప్పారు. క్రాప్ బుకింగ్ చేయక పోవడం ప్రభుత్వ వైఫల్యం కాదా? దీనికి రైతులు ఎందుకు బలి కావాలి? అని ప్రశ్నించారు. కంది పండించిన రైతులందరి వద్ద కందులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

> కందులు పండించిన రైతుల నుంచి ఎకరాకు మూడు క్వింటాళ్లే కొనుగోలు చేస్తున్నరు. మిగతాది ఎక్కడ అమ్ముకోవాలి? మూడు క్వింటాళ్లే కొనుగోలు చేసుడు ఏంది? కంది రైతుల మీద ఇంత పగ ఎందుకు? ఇంత కక్ష ఎందుకు? కందులు పండించడం నేరమా?
>
> **- హరీశ్‌రావు**

> బీఆర్‌ఎస్‌ది జగమంతా పాలన.. కాంగ్రెస్‌ది సగమంత పాలన. మాది అసలు పాలన.. మీది కొసరు పాలన. సంతృప్తి, సంక్షేమం బీఆర్‌ఎస్ పాలన.. సంక్షోభం, అసంతృప్తి, అసహనం కాంగ్రెస్ విధానం.
>
> **- హరీశ్‌రావు**

### పొద్దుతిరుగుడు కేంద్రాలు ప్రారంభించాలి

పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను కూడా వెంటనే ప్రారంభించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నూనె గింజలు పండించే రైతులకు ప్రభుత్వం శఠగోపం పెడుతున్నదని విమర్శించారు. పొద్దుతిరుగుడు క్వింటాల్‌కు రూ.7,280 మద్దతు ధర ఉన్నదని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు బయట మార్కెట్‌లో 6 వేలకు అమ్ముకుని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కందులు, పొద్దుతిరుగుడు, పల్లి పంటను షరతులు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ మోసకారి

కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని అన్ని గ్రామాల్లో ప్రజలు మాట్లాడుకుంటున్నారని హరీశ్‌రావు చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తాను తవ్వుకున్న గ్యారెంటీల సమాధిలోనే సమాధి అవుతుందని ఎద్దేవా చేశారు. ఇక్కడి గ్యారంటీల వైఫల్యాల ఎక్కడెక్కడో కాంగ్రెస్ పార్టీని గాయబ్ చేస్తున్నదని, ఇక్కడ కూడా ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ పార్టీని గాలిలో కలపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాజనర్సు, పూజల వెంకటేశ్వరరావు, మనోహర్‌రావు, సంపత్ రెడ్డి, భూపేష్, వేణుగోపాల్‌రెడ్డి, సోంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రియల్ ఎస్టేట్‌లో కాంగ్రెస్ డిజాస్టర్

'కాంగ్రెస్ పాలనలో రియల్‌ఎస్టేట్ రంగం డిజాస్టర్ అయింది. సర్కారు అనాలోచితంగా తెచ్చిన హైడ్రా, మూసీ, ఫార్మా, మెట్రోలైన్ ప్రాజెక్టులతో సంక్షోభంలో కూరుకుపోయింది' అని హరీశ్‌రావు విమర్శించారు. ఏడాదిన్నరగా హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ రంగం కుదేలవుతున్నా రేవంత్ సర్కారు చోద్యం చూస్తున్నదని మండిపడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వేణుగోపాల్‌రెడ్డి, నరసింహగౌడ్ ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. వీరి బలిదానాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. రైతన్నలు, నేతన్నలు, ఆటోడ్రైవర్లతో మొదలైన ఆత్మహత్యల పరంపర రియల్‌ఎస్టేట్‌కు చేరడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో తెలంగాణ గ్రోత్‌ఇంజిన్ అయిన హైదరాబాద్ అభివృద్ధికి విఘాతం కలుగుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్ బాగుంటేనే తెలంగాణ బాగుంటుందనే విషయం మున్సిపల్ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రికి తెలియదా? అని ప్రశ్నించారు.

#### ప్రభుత్వానికి హరీశ్‌రావు ప్రధాన డిమాండ్లు

- సన్నవడ్లు అమ్మిన రైతులకు వెంటనే రూ.432 కోట్ల బోనస్ డబ్బులు విడుదల చేయాలి.
- షరతులు, కోతలు లేకుండా పూర్తిస్థాయిలో కందులు కొనుగోలు చేయాలి.
- ఆన్‌లైన్‌లో వ్యవసాయ శాఖ నమోదు చేయకపోవడం వల్ల మిస్సయిన కంది రైతుల నుంచి కూడా కందులు కొనుగోలు చేయడానికి అనుమతి ఇవ్వాలి.
- పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి.
- రైతు భరోసా డబ్బులను తక్షణమే ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇవ్వాలి.

## నేటితో ఎమ్మెల్సీ నామినేషన్ల ముగింపు

- ఇప్పటివరకు 85 దాఖలు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల గడువు సోమవారం ముగియనున్నది. 85 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు వెల్లడించారు. సోమవారం గడువు ముగియనుండడంతో నేడు పెద్దసంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉన్నట్టు తెలిపారు.

## తునికాకు సేకరణ పనులు చేపట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): తునికాకు సేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఏటా జనవరి నాటికే తునికాకు సేకరణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను అటవీశాఖ పూర్తి చేస్తుందని, కానీ ఈ ఏడాది తాత్సారం చేయటంతో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో అటవీశాఖ చేపట్టే తునికాకు సేకరణపై 10 లక్షల మంది ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఉపాధి కోల్పోకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ ద్వారా తగిన ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

## హామీలను నెరవేర్చాలి

- ఎమ్మెల్సీ అభ్యర్థి ఇన్నారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎస్‌ఈయూ కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్థికేతర డిమాండ్లను మంత్రివర్గ ఉపసంఘం పరిష్కరించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సీపీఎస్‌ఈయూలో కేజీబీవీ, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమావేశం ఆదివారం సీపీఎస్‌ఈయూ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అధ్యక్షతన నిర్వహించారు. టర్మినేషన్ విధానాన్ని ఎత్తివేయాలని, మరణించిన, రిటైర్డ్ అయినవారికి బెనిఫిట్స్ అందజేయాలని, ఆరోగ్యబీమా, ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ఇన్నారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఢిల్లీలో 'ఆప్'ను మేమే ఓడించాం!

- హర్యానాలో కేజ్రీవాల్ మమ్మల్ని ఓడించారు
- రెండు రాష్ట్రాల్లోనూ లబ్ధి పొందిన పార్టీ బీజేపీ
- కేరళ పర్యటనలో రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా అమలు చేసినట్టుగా ప్రచారం
- పీవీకి కాంగ్రెస్ చాలా చేసింది
- సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలపై సర్వత్రా వెల్లువెత్తిన విమర్శలు



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం కూలిపోవడానికి, అరవింద్ కేజ్రీవాల్ ఓడిపోవడానికి కాంగ్రెస్సే కారణమని సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హర్యానాలో కాంగ్రెస్ ఓటమికి ప్రతీకారంగానే ఢిల్లీ పరిణామాలు చోటుచేసుకున్నట్టు చెప్పారు. ఆదివారం కేరళలోని తిరువనంతపురంలో జరిగిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొంతపార్టీపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో అమలు చేయని పనులను చేస్తున్నట్టుగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారు. 'హర్యానాలో కేజ్రీవాల్ డిస్టర్బ్ చేశారు. కాంగ్రెస్ ఓడిపోయింది. అందుకే ఢిల్లీలో కాంగ్రెస్ చేయాల్సినంత చేసింది. అంతిమంగా రెండు రాష్ట్రాల్లో బీజేపీకి లబ్ధి చేకూరింది' అని వ్యాఖ్యానించారు. దీనిని బట్టి కాంగ్రెస్, బీజేపీ పరస్పర లబ్ధి కోసం పనిచేస్తున్నాయని పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్‌లో క్షేత్రస్థాయి నేతలు ఢిల్లీ పెద్దలను పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీలో సర్పంచ్ ఎన్నికల్లో కూడా మోదీకి ఓటేయాలన్నట్టుగా ప్రచారం చేస్తారని తెలిపారు. కానీ కాంగ్రెస్‌లో జాతీయ నాయకులను పట్టించుకోకుండా స్థానిక నాయకుల పేర్లు చెప్పి ఓట్లు అడుగుతుండటంతో వరుస ఓటములు కలుగుతున్నాయని తెలిపారు.

### అమలు చేయకున్నా.. చేసినట్టు ప్రచారం

రాష్ట్రంలో భూమి లేని నిరుపేద కుటుంబాలకు రూ.12 వేలు ఆర్థిక సాయం ఇచ్చామని, ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.5 లక్షలు ఇస్తున్నామని కేరళ పర్యటనలో రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ రెండు పథకాలను ప్రభుత్వం ప్రకటించిందే తప్ప ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. అయినా అమలు చేసినట్టు ప్రకటించుకోవడంపై రాజకీయవర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతుభరోసా కింద కూడా ఎకరాకు రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఒక విడత రైతుభరోసా పూర్తిగా ఎగ్గొట్టి, మరోవిడత అరకొరగా ఇచ్చి, ఇప్పుడు పూర్తిగా ఇస్తున్నట్టు గొప్పలు చెప్పుకోవడం ఏమిటని రైతుసంఘాల నేతలు మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి గొప్పలు చెప్పుకోవడం రేవంత్‌రెడ్డికి బాగా అలవాటయిందని విమర్శలు గుప్పిస్తున్నారు.

### పీవీకి అవమానం జరగలేదట!

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మరణించిన తర్వాత కాంగ్రెస్ ఏ స్థాయిలో అవమానించిందో దేశ ప్రజలందరికీ తెలిసిందే. కానీ పీవీని కాంగ్రెస్ అవమానించలేదని రేవంత్‌రెడ్డి వెనుకేసుకొచ్చారు. ఇదంతా ప్రధా ని నరేంద్ర మోదీ, బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ సృష్టించిన అపోహ అంటూ కొట్టిపారేశారు. కేవలం సర్పంచి స్థాయిలో ఉన్న పీవీ నరసింహారావుకు అవకాశాలు ఇచ్చి, రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో పదవులు ఇచ్చి, ప్రధానిని చేసిన ఘనత కాంగ్రెస్‌దని చెప్పుకొచ్చారు. తనకు పీవీ కుటుంబంతో మంచి అనుబంధం ఉన్నదని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలే మండిపడుతున్నారు. పీవీ నరసింహారావును కాంగ్రెస్ అవమానించినప్పుడు రేవంత్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ప్రధానిగా పనిచేసిన పీవీ పార్థివ దేహాన్ని కనీసం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలోకి రానివ్వలేదని, ఢిల్లీలో అంత్యక్రియలు చేయనీయలేదని గుర్తుచేశారు. అధిష్ఠానం దగ్గర తన పరపతిని కాపాడుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇలా తప్పుడు ప్రచారం చేయడం ఏమిటని నిలదీస్తున్నారు.

### *నాన్న పార్థివ దేహానికి కనీస మర్యాద ఇవ్వలేదు*

#### *ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఆవేదన*



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యల పట్ల మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కూతురు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. కష్టాల్లో ఉన్న కాంగ్రెస్‌ను, ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని గట్టెక్కించిన నేతగా పీవీ నరసింహారావును ప్రజలంతా గౌరవిస్తారని తెలిపారు. సృష్టిలో మనిషి పుట్టుక, చావే విలువైనవని, నాన్నగారి అంతిమ సంస్కారంలో కాంగ్రెస్ చేసిన సంస్కారహీనమైన ప్రవర్తన ఒక గాయంగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పీవీ పార్థివ దేహానికి కూడా కాంగ్రెస్ కనీస మర్యాద ఇవ్వలేదని అన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలోకి రానీయకుండా, తలుపులు మూయించి, ఆయనకు చేసిన అవమానాన్ని దేశ ప్రజలు మర్చిపోరని, పీవీ పిల్లలుగా తమ జీవితంలో ఇంతకంటే దారుణమైన ఘటన ఏమీ ఉండదని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఢిల్లీలో అంత్యక్రియలు జరపకుండా హైదరాబాద్‌కు పంపించివేశారని, హైదరాబాద్‌లో అయినా గౌరవంగా కార్యక్రమాలు చేశారా అంటే అదీ లేదని ఆనాటి ఘటనను గుర్తుచేసుకొని బాధపడ్డారు. మనోవేదననే కాంగ్రెస్ పీవీకి, తమకు ఇచ్చిందన్నారు. పీవీకి పదవుల మీద ఆశ లేదని, తాను సన్యాసం తీసుకుని పీఠాధిపతి కావాలనుకున్నారని, కాంగ్రెస్ పార్టీకి దిక్కులేక పీవీని బతిమిలాడుకుంటే పార్టీకి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. రాజకీయాల కోసం పీవీ నర్సింహారావు పేరు తీస్తూ తమ గుండె గాయాన్ని పదే పదే గుర్తుచేయవద్దని, ఆయనకు జరిగిన అన్యాయం గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని సీఎం రేవంత్‌రెడ్డికి హితవు పలికారు.

# అన్ని టెండర్లు ఆ మంత్రికేనా?

మొదటిపేజీ తరువాయి...

ఆ మంత్రి గట్టిగా డిమాండ్ చేస్తున్నారట! ఇంతకీ ఆయనకు చెందిన నిర్మాణ కంపెనీలకే ఆ టెండర్లు ఇస్తారా? అంటే.. ఏమోనట! ఆయనకు ఇచ్చిన పనులు ఆయన ఇష్టం.. ఎవరికైనా ఇచ్చుకోవచ్చన్న మాట వినిపిస్తున్నది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు సర్వే దశలో ఉన్నాయి. వాటి టెండర్లు పూర్తయ్యే నాటికి గతంలో వరుసగా పనులు దక్కించుకున్న మంత్రి చక్రం తిప్పుతారా? లేక గుర్రుగా ఉన్న మంత్రితో రాజీ కుదుర్చుకుంటారా? అనేది వేచిచూడాల్సిందే.

### ఏడాదిపాటు ఎదురుచూసి..

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న లోకనీతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బాగానే ఒంట పట్టించుకున్నారు. అసలే అధికార పార్టీ.. అందునా బుగ్గకారు హోదా కూడా వచ్చిందంటే నాలుగు చేతులా కాకున్నా రెండు చేతులానైనా పనులు దక్కించుకోవాలనే లక్ష్యం ఉంటుంది. అందులో భాగంగానే దక్షిణ తెలంగాణలోని ఓ జిల్లాకు చెందిన మంత్రి భారీ టెండర్లకే గురి పెట్టారు. ఒకటీ అరా కాదు.. ఏకంగా రూ.16 వేల కోట్ల ఓ రహదారి ప్రాజెక్టు రూపుదిద్దుకుంటే తనకు పేరుతోపాటు పనులు కూడా దక్కుతాయని గంపెడాశతో ఉత్సాహంతో ముందుకుసాగారు. కానీ, ఏడాది గడచినా ఆ ప్రాజెక్టు భవితవ్యం ఇప్పట్లో తేలేలా కనిపించకపోవడంతో విసిగిపోయారు. ఒక్కసారి చుట్టూ చూస్తే.. పక్క మంత్రి ఒకరు రూ.వేల కోట్ల ప్రాజెక్టులను దక్కించుకున్న విషయం గుర్తొచ్చింది. దీంతో చిర్రెత్తిపోయిన ఆ మంత్రి.. అరె ఇదేందీ? అన్ని పనులు ఆయనకేనా? సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల పనులు సహా అన్ని టెండర్లూ ఆయనకే ఇస్తే ఎట్లా? అని ప్రభుత్వ పెద్దల వద్ద తన అసంతృప్తిని వెళ్లగక్కడంతో పాటు పనిలో పనిగా ఓ షరతు కూడా పెట్టినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

### ఆ ప్రాజెక్టు పనులు నాకే..

ఏడాదికిపైగా ఒక్క కాంట్రాక్టు లేకుంటే ఎలా? అని ప్రభుత్వ పెద్దలను ప్రశ్నించిన ఆ మంత్రి.. తనను నమ్ముకొని ఇంకొకరున్నరని, అందుకే తన జిల్లాలో సర్వే దశలో ఉన్న సాగు నీటి ప్రాజెక్టు పనులు తనకే ఇవ్వాలని, ఇందులో ఎవరూ జోక్యం చేసుకోకూడదని, ముఖ్యంగా ఇప్పటికే పనులు దక్కించుకున్న మరో మంత్రి జోక్యం చేసుకుంటే సహించేదే లేదని కరాఖండిగా స్పష్టం చేసినట్టు తెలిసింది. ఇదే విషయాన్ని సంబంధిత శాఖ మంత్రికి కూడా చెప్పారని, తన జిల్లాలో చేపట్టే ప్రాజెక్టు పనులు తనకే దక్కాలని పట్టుబట్టారని సమాచారం. దీంతో ఆ ప్రాజెక్టు ఇంకా టెండర్ల దశకే రాలేదని, ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆ శాఖ మంత్రి తల పట్టుకున్నట్టు తెలిసింది. ఈ విషయం ఇతర మంత్రులకు, ప్రభుత్వంలోని కొందరు పెద్దలకు తెలవడంతో లోలోపలే నవ్వుకుంటున్నట్టు ప్రచారం సాగుతున్నది. ఎవరి జిల్లాలోని ప్రాజెక్టుల పనులు వారికే దక్కాలనుకోవడం సరికాదని, టెండర్లు దక్కాలంటే దానికో లెక్క, పత్రం ఉంటుందని, 'పెట్టే చేతికే' ఇచ్చేదుంటదిగానీ ఎవరి ఇలాకాలోనిది వాళ్లకేనంటే బండి ఎట్ల నడవాలె అని మనసులో అనుకుంటున్నరట. ఆ ప్రాజెక్టు టెండర్ల దశకు వచ్చేలోగా షరతు పెట్టిన మంత్రికి తత్వం బోధపడుతుందిలే అనుకుంటూ ప్రస్తుతానికి ఆ కోల్డ్‌వార్‌ను పట్టించుకోవడం లేదట.

# కాంగ్రెస్ బోనస్.. బోగస్

- రైతాంగాన్ని మోసం చేసిన సర్కార్
- హామీలు అమలుకాకపోతే ప్రజాతిరుగుబాటు తప్పదు
- రూ.432 కోట్ల బోనస్ చెల్లింపులు పెండింగ్
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట, ఫిబ్రవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.500 బోనస్ హామీ బోగస్‌గానే తయారైందని, రాష్ట్ర రైతాంగాన్ని రేవంత్ సర్కార్ మోసం చేసిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, 50శాతం కూడా పూర్తి చేయలేదని చెప్పారు. రూ.2లక్షలపై రుణం ఉన్న రైతులు మిగతా డబ్బులను బ్యాంకులకు చెల్లించారని, రుణ మాఫీ అవుతుందనుకుంటే మళ్లీ అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు భరోసా 15వేలు ఇస్తామని చెప్పి 12వేలకు తగ్గించడం దారుణమని, నేటికీ రైతుభరోసా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 86,40,000 క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించిన రూ.432 కోట్ల బోనస్ చెల్లింపులు పెండింగ్‌లోనే ఉన్నాయని, రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమకాక పోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని, సమయానికి పెట్టుబడి, విద్యుత్, నీళ్లతో వ్యవసాయం పండుగగా మారిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే హామీలన్నీ అమలు చేసి గ్రామాల్లోకి రావాలని, లేదంటే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

## ఎస్సీలకు 18 % రిజర్వేషన్ ఇవ్వాలి

- కోటా పెంచిన తర్వాత వర్గీకరణ చేయాలి
- ఉప ఎన్నిక వస్తే పోటీకి సిద్ధం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వరంగల్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల కోటాను పెంచాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 18 శాతానికి పెరిగిందని, దీని ప్రకారం ఎస్సీల రిజర్వేషన్లను 18 శాతానికి పెంచి మూడు గ్రూపులుగా వర్గీకరణ చేయాలని సూచించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అభ్యంతరాలను స్వీకరించి, తుది ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత దేశంలోనే తొలిసారిగా తెలంగాణలోఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తవుతున్నని చెప్పారు. బీఆర్‌ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలనే పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును శిరసావహిస్తానని చెప్పారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక వస్తే తప్పకుండా పోటీలో ఉంటానని తేల్చి చెప్పారు.

## 27.5 లక్షలు పలికిన 'సర్పంచ్' పదవి?

- గద్వాల జిల్లా గోకులపాడులో ఘటన

మానవపాడు, ఫిబ్రవరి 9 : గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల సందడి మొదలయ్యింది. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం గోకులపాడులో సర్పంచ్ పదవికి వేలం నిర్వహించగా ఓ యువకుడు రూ.27.50 లక్షలకు ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. నోటిఫికేషన్ రాగానే సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేలా గ్రామపెద్దలు తీర్మానం చేసినట్టు తెలిసింది. వేలంలో వచ్చిన నగదుతో గ్రామాభివృద్ధికి వినియోగించుకునేలా తీర్మానం చేసుకున్నట్టు సమాచారం. ఈ విషయంపై గ్రామస్తులను ఆరాతీయగా గ్రామాభివృద్ధి కోసం చర్చించుకునేందుకే సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.